


# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 299 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శనివారం, 22 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 299 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR SATURDAY, 22 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


# షావుకారు జానకి కన్నుమూత

### చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

### 400కు పైగా చిత్రాల్లో అలరించిన నటి

చెన్నై: దశాబ్దాల పాటు తన అద్భుత నటనతో అలరించిన అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. కొద్ది రోజులుగా శ్వాసకోశ, వయోధిక సమస్యలతో బాధపడుతున్న ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఐసీయూకి తరలించి వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె తుదిశ్వాస విడిచారు. జానకి తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో 400కి పైగా సినిమాల్లో నటించి ఎన్నో పాత్రలకు జీవం పోశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సచీదేవి, టేకుమళ్ల వెంకోజీరావు దంపతులకు 1931లో జన్మించారు జానకి. రేడియో నాటకాలతో కెరీర్‌ని ప్రారంభించిన ఆమె 'షావుకారు' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్నారు. కన్యాశుల్కం, పిచ్చిపుల్లయ్య, రోజులు మారాయి, పసుపుకుంకుమ, బీదల ఆస్తి, ఆదర్శం, ఏది నిజం?, భాగ్యరేఖ, ముందడుగు, అన్న తమ్ముడు, బాటసారి, మంచి మనసులు, డాక్టర్ చక్రవర్తి, మంచి కుటుంబం, అక్కా చెల్లెలు, సంసారం ఒక చదరంగం, శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం... ఇలా ఎన్నో సినిమాలు ఆమెకి మంచి పేరుని తీసుకొచ్చాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ లాంటి పలువురు అగ్ర కథానాయకులతో కలిసి నటించారు జానకి. 'సంసారం ఒక చదరంగం', 'అమూల్యం' సినిమాల్లో నటనకు నంది పురస్కారాలు అందుకున్నారు. 2022లో కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం స్వీకరించారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి కళైమామణి అవార్డుని అందుకున్నారు. ఆమె భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం చెన్నైలోని నివాసంలో ఉంచారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఆమె మృతికి సంతాపం ప్రకటించారు. జానకి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సినీ నటులు చిరంజీవి, బాలకృష్ణ, కమల్‌హాసన్, ఎన్టీఆర్, రాధికతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆమె మృతికి సంతాపం ప్రకటించారు. జానకికి ఇద్దరు కుమార్తెలు యజ్ఞ ప్రభ కోటి, సచీరావు, కుమారుడు వెంకటరమణ ఉన్నారు.

**చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతాపం**

షావుకారు జానకి భౌతికంగా మనకు దూరమైనా.. ఆమె పోషించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని సీఎం చంద్రబాబు అన్నారు. ఆమె మృతిపై శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 400కు పైగా చిత్రాల్లో నటించిన ఆమె ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. జానకి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న నటి షావుకారు జానకి అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, తమిళ,

కన్నడ భాషల్లో తన విలక్షణ నటనతో ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు చెప్పారు. వైవిధ్య పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ఆమె చెరగని స్థానం సంపాదించుకున్నారని మంత్రి నారా లోకేశ్ అన్నారు.



## ఆయుర్వేద థెరపీ కోసం నేడు కేరళకు పవన్‌కల్యాణ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శనివారం కేరళకు వెళ్లనున్నారు. ముంబయిలో ఈ మధ్య కుడి భుజం రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన.. వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. 'శస్త్ర చికిత్స అనంతరం వైద్యులు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు సూచించారు. అయితే పాలనా బాధ్యతల దృష్టితో వారం రోజుల్లోనే పవన్‌కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో అందుబాటులోకి వచ్చారు. ముందుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహించారు. శస్త్రచికిత్స చేసిన భుజం భాగంలో వాపు రావడంతోపాటు తీవ్ర జ్వరం వచ్చింది. వైద్యుల సలహా మేరకు భుజం పూర్తి స్థాయిలో కోలుకునేందుకు ఇప్పుడు కేరళలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకుంటారు' అని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

# ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టండి

అమరావతి: ఏపీలో పెట్టుబడులు పెట్టాలని అమెరికాలోని ప్రవాసాంధ్ర ఐటీ పారిశ్రామికవేత్తలను ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ ఆహ్వానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూల వాతావరణం నెలకొందని తెలిపారు. అమెరికాలోని న్యూజెర్సీలో వారితో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక రంగంలో తీసుకొస్తున్న మార్పులు, అమరావతి అభివృద్ధి ప్రణాళికల్ని వారికి వివరించారు. "చంద్రబాబు దార్శనికత, మంత్రి చొరవతో ఆధునిక సాంకేతిక రంగాల్లో రాష్ట్రం పురోగమిస్తోంది. గూగుల్ లాంటి అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. క్వాంటమ్ టెక్నాలజీకి అమరావతి కేంద్రంగా మారనుంది. అమెరికాలోని తెలుగు పారిశ్రామికవేత్తలు తమ అనుభవాన్ని ఏపీతో అనుసంధానించుకోవాలి. తద్వారా రాష్ట్ర ఆర్థికవ్యవస్థ బలోపేతానికి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగస్వాములు కావాలి" అని మన్నవ మోహన్‌కృష్ణ కోరారు. అమరావతిలో ఏర్పాటుచేయనున్న క్వాంటమ్ వ్యాలీ సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలు తెస్తుందని పలువురు పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు.





5

## విద్యా రంగంలో ఐదు కీలక బిల్లులు

- శాసనమండలిలో ఏకగ్రీవ ఆమోదం
- నారా లోకేశ్ ప్రవేశపెట్టిన బిల్లులు
- ఉన్నత విద్య, గ్రంథాలయ రంగాల్లో సంస్కరణలు
- నైపుణ్య విశ్వవిద్యాలయాలకు మార్గం సుగమం

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విద్యా రంగానికి సంబంధించిన ఐదు కీలక బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, సభ్యులందరి మద్దతుతో మండలి వాటిని ఆమోదించింది. విద్య, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సంస్కరణలను వేగవంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించినట్లు వెల్లడించింది.



## మోడల్ గ్రామంగా రామకృష్ణాపూర్

- పల్లె పల్లెలో ప్రజా పాలనకు విశేష స్పందన
- పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా వినతుల స్వీకరణ

హనుమకొండ, ఆగస్టు 20 :

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం రామకృష్ణాపూర్ గ్రామంలో నిర్వహించిన "పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

2

## కల్వకుర్తి కాల్వలను పరిశీలించిన జూపల్లి

### నీటి పొదుపుపై ప్రత్యేక ఆదేశాలు

- ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేయాలి
- ఆయకట్టు చివరి భూములకూ నీరు అందాలి
- అధికారులకు నిరంతర పర్యవేక్షణ సూచన



నాగర్‌కర్నూల్, ఆగస్టు 20 :

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ-8 కాల్వ పరిధిలోని పలు కాల్వలను మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. తూడుకుర్తి సమీపంలోని ప్రధాన కాల్వ నుంచి సాకర్‌పల్లి, ఏదుట్ల, గోపాలపేట, రేమద్దుల, సింగాయిపల్లి, తురకపల్లి, గోపులపురం ప్రాంతాలకు వెళ్లే కాల్వలను సందర్శించి నీటి (మిగతా 2వ పేజీలో)

## తెలంగాణలో రైల్వే అభివృద్ధిపై సమీక్ష



- దక్షిణ మధ్య రైల్వే ఎంపీల వార్షిక సమావేశం
- మౌలిక సదుపాయాల విస్తరణపై చర్చ
- ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యం

సికింద్రాబాద్, ఆగస్టు 20 :

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పార్లమెంట్ సభ్యుల వార్షిక సమావేశం గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమలవుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రయాణికుల సాకర్యాల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు.

2

# రాజకీయ కోణం లేదు

## విధివిధానాల లోపాల వల్లే కేంద్రం నిర్ణయించింది

## పెట్టుబడుల సమావేశాలకు సీఎం బృందానికి ప్రత్యేక అనుమతులు

## బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



**హైదరాబాద్** : ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అమెరికా పర్యటనకు విదేశాంగ మంత్రిత్వశాఖ పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వరపోవడం వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. సీఎంతో పాటు వెళ్లే అధికా రుల ప్రతినిధి బృందానికి పెట్టుబడులు, ఒప్పందాల కోసం సమావేశాలు నిర్వహించుకోవ డానికి ఇప్పటి కె కేంద్రం అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధంగా ముఖ్యమంత్రులు లేదా మంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లే సమయంలో ఆ పర్యటన అధికారిక ఆవశ్యకత, ఆహ్వానిం చిన సంస్థల నేపథ్యం, హాజ రయ్యే వ్యక్తుల స్థాయి, అంతర్జా తీయ ప్రోటోకాల్, డిప్లొమాటిక్ అంశాలు, భద్రతా ఏర్పాట్లు, ఎఫ్సీఆర్ఎ నిబం ధనలు తదితర కీలక అంశాలను క్షుణ్ణం గా పరిశీలించిన తర్వాతే విదేశాంగ శాఖ నిర్ణయం తీసు కుంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్కు చెందిన ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ విజయేందర్, డాక్టర్ ప్రమోద్బీజేపీలో చేరారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కమిటీలను నిర్మించి విశేష సేవలం దిస్తున్న డాక్టర్ విజ యేందర్, తోటి వైద్యులందరి మద్దతును బీజేపీకి సమీకరిస్తూ పార్టీలో చేరడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2012లో నాటి అస్సాం కాంగ్రెస్ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ అమెరికా, ఇజ్రాయెల్ పర్యటనలను, అదేవిధంగా నాటి జార్ఖండ్ బీజేపీ సీఎం అర్జున్ ముండా థాయిలాండ్ పర్య టనను కేంద్రం తిరస్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నాడు గుజరాత్ ముఖ్య మంత్రిగా ఉన్న నరేంద్ర మోదీకి అమెరికా వీసా రాకుండా కాంగ్రెస్ ఎంపీలు, నాయకులు కుట్రపూరితంగా లేఖలు రాసి న చరిత్రను గుర్తుచేశారు. గతం లో సీఎం రేవంత్రెడ్డి విదేశాలకు వెళ్లినప్పుడు కేంద్రం ఎలాంటి అడ్డం కులు సృష్టించలేదని, తాజా పర్య టనకు సంబంధించిన నిబం ధనలు, విధివిధా నాల లోపాల ప్రకారమే నిర్ణయం జరిగిందని, రాజకీయం చేయొద్దని హెచ్చ రించారు. కాగా... నీట్ ద్వారా ప్రవేశాలు పొందిన ఎంబీబీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి ప్రైవేట్ మెడికల్ కాలేజీలు =ఝఃఱఅవ అక్రమంగా ఫీజులు వసూలు చేయడంపై ఎన్. రాంచంద్రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగున్నర సంవత్సరాల కోర్సు ఫీజును అయిదు వాయిదాలలో చెల్లించాలని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమి కమిటీ నిర్దేశించినప్పటికీ, కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు నిబంధనలకు ఆరుద్ధంగా కు ఆరుద్ధంగా ఐదేళ్ల పూర్తి పీ జును వసూలు చేస్తూ ఒక్కో విద్యార్థి కుటుంబంపై రూ.13 లక్షల నుండి రూ. 20 లక్షల వరకు అదనపు భారం మోపా యని మండిపడ్డారు. విద్యార్థుల నుండి అదనంగా వసూలు చేసిన ఫీజులను వెంటనే వాపస్ చేయాలని టీఏఎస్ఆర్సి చైర్మన్ జస్టిస్ గోపాల్ రెడ్డితోపాటు హైకోర్టు కూడా స్పష్టమైన తీర్పులిచ్చాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తక్షణమే జోర్యం చేసుకుని ఆయా ప్రైవేట్ కళాశాలల నుంచి విద్యార్థులకు ఫీజులు రీఫండ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన బీజేపీ నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడు తుందని హెచ్చరించారు.

# రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

## అందుకే సిఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ

## విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ

**న్యూఢిలీ ,ఆగస్ట్21 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల

అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్లోని ఆక్స్ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్బాల్ ప్రజెంటేషన్లో పాల్గొనుంది. అనంతరం యూఎస్కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# కారులో మహిళ మృతదేహం లభ్యం

## మృతురాలిని గోదావరిఖినికి చెందిన మానసగా గుర్తింపు

**హన్మకొండ,ఆగస్ట్20:** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కారులో మహిళ మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. బస్టాండ్ సమీపంలో రెండ్రోజులుగా పార్క్ చేసిన కారు నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. కారు డిక్కీని ఓపెన్ చేయగా మహిళ మృతదేహం మూటకట్టి ఉంది. కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతురాలు గోదావరిఖనికి చెందిన మానస (33)గా గుర్తించారు. కారును మానస స్నేహితుడు వినోద్ అ÷-దదెకు తెచ్చినట్టు సమాచారం. దీంతో వినోద్ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. 'కరీంనగర్లో గదిలో ఉన్నప్పుడు మానసకు ఫిట్స్ వచ్చాయి. ఫిట్స్, నోట్లో నుంచి నురగలు వచ్చి ఆమె చనిపోయింది. భయంతో మృతదేహాన్ని ఎల్కతుర్తి వద్ద కారులోనే వదిలి వెళ్లిపోయా' అని వినోద్ పోలీసులకు చెప్పినట్టు తెలుస్తోంది. కేసు నమోదు చేసిన ఎల్కతుర్తి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. వినోద్ చెప్పిన విషయాలు నిర్ధరించుకునే పనిలో ఉన్నారు.

# రాయదుర్గం భూములకు రికార్డు ధర

## వేలంలో ఎకరాకు 264 కోట్లకు అమ్మకం

**హైదరాబాబాద్,ఆగస్ట్21 :** నగరంలోని రాయదుర్గంలో ఎకరం భూమి రికార్డు ధర పలికింది.

పాన్మక్తాలో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ శుక్రవారం వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఎకరా రూ.264 కోట్లకు అమ్ముడుపోయింది. ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని సొంతం చేసుకుంది. మొత్తం 5.25 ఎకరాలనూ ఆ సంస్థే దక్కించుకుంది. ఇదే సర్వే నంబర్లో మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికింది. వేలంలో కనీస ధర రూ.175 కోట్లు, డిపాజిట్ రూ.10కోట్లుగా టీజీఐఐసీ నిర్ణయించింది. బిడ్డర్లు డిపాజిట్ చెల్లించి ఆన్లైన్ వేలంలో పాల్గొన్నారు. ఖరీదైన భూమి కావడంతో స్థిరాస్తి సంస్థలు పోటీపడి బిడ్డింగ్ దాఖలు చేశాయి. చివరికి ఎంఎస్ఎన్ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని దక్కించుకుంది.

# సీఎం అమెరికా టూర్ రద్దు



అంటూ జరిగిన ప్రచారంతో రాజకీయ వాతావరణ వేడెక్కింది. 20 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేల సమావేశం.. ఆ తర్వాత చెలరేగిన వివాదం విదేశీ పర్యటనలో ఉన్న సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. తాజా ఉత్కంఠ భరిత పరిణామాలు ఒకవైపు, అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడం వంటి ఘటనల నేపథ్యంలో సీఎం రేవంత్ బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని ఈనెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్కు చేరుకోనున్నారు. రద్దయిన ఈ పర్యటనను వచ్చే నెలలో తిరిగి చేపట్టాలని ఆయన భావిస్తున్నట్లు గా తెలుస్తోంది.

### కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరణ

తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా లండన్, అమెరికాలలో తెలంగాణ రైజింగ్ పేరుతో ప్రతినిధుల సమావేశాలు నిర్వహించడానికి ప్రొటోకాల్ ప్రకారం తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. అయితే, చివరి నిమిష లో కేంద్ర విదేశాంగ శాఖ కేవలం యూకేలో నిర్వహించే సమావేశాలకు మాత్రమే అనుమతినిచ్చింది. అమెరికా లో నిర్వహించాల్సిన సదస్సులకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాక పోవడంతో, సీఎం రేవంత్ రెడ్డి తన పర్యటన షెడ్యూల్ను కుదిం చుకుని రాష్ట్రానికి తిరిగి రానున్నారు. వాస్తవానికి అమెరికాలోని ప్రముఖ నగరాలైన బోస్టన్, న్యూయార్క్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించి సర్వం సిద్ధమైంది. అక్కడి పర్యటనకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం మినిట్-టు-మినిట్ షెడ్యూల్ను పర్యవేక్షిస్తూ ఏర్పాట్లను పూర్తి చేసింది. అయితే, చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున సంచలనంగా మారింది. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించడంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. యూకే, అమెరికా పర్యటనల కోసం రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాల ప్రకారంకేంద్ర అనుమతి కోరగా, మొదట యూకే పర్యటనకు మాత్రమే మంజూరు లభించింది. ప్రతినిధి బృందం లండన్ చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం తెలియజేసింది. దీంతో సీఎం తన అమెరికా పర్యటనను రద్దు చేసు కుని, లండన్ నుంచి ఆగస్టు 28న హైదరాబాద్కు తిరిగిరానున్నారు. అయితే అనూహ్యంగా చోటుచేసుకున్న పరిణామాలపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రం అనుమతి ఇవ్వకపోవటంపై రేవంత్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ రైజింగ్ ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. అధికారులను పర్యటన కొనసాగించాలని సూచించారు. వాస్తవానికి ముందస్తుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 19 నుంచి 30 వరకు పదిరోజుల పాటు విదేశాల్లో సీఎం పర్యటించాల్సి ఉంది. 23 వరకు లండన్లో పర్యటించనున్న సీఎం.. అక్కడి నుంచి అమెరికాలోని బో స్టన్కు వెళ్లాల్సి ఉంది. ఈనెల 29 వరకు అమెరికాలో పర్యటించి.. తిరిగి 30న హైదరాబాద్కు తిరిగి రావాల్సి ఉంది.

### సహజంగా అయితే ఇలా...

సహజంగా దేశంలోని ఏ రాష్ట్ర ముఖ్య మంత్రి అయినా ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడం కోసం విదేశాలకు వెళ్లాలంటే కేంద్ర ప్రభుత్వం (ప్రధాని, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక శాఖ) నుంచి అనుమతు లు తీసుకోవాల్సి ఉంటుంది. ఏవైనా అవాం ఛనీయ, ప్రత్యేక పరిస్థితులు నెలకొంటే తప్ప.. సీఎం కార్యాలయం కోరగానే కేంద్రం నుంచి అనుమతులు మంజూరు అవుతాయి. ఈ క్రమంలో ఈనెల 20 నుంచి 29 వరకు బ్రిటన్, అమెరికా దేశాల్లో సీఎం రేవంత్రెడ్డి పర్యటన కోసం కేంద్రం అనుమతి కోరుతూ తెలంగాణ సీఎంవో లేఖ రాసింది. అందులో బ్రిటన్ పర్యటనకు కేంద్రం అనుమతి లభించింది. దీంతో బుధవారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఢిల్లీ నుంచి సీఎం రేవంత్ లండన్కు వెళ్లారు. కాగా, షెడ్యూల్ ప్రకారం.. ఆదివారం(23) లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్కు సీఎం వెళ్లాల్సి ఉ ంది.

### అందుకే అనుమతించలేదు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ రాజకీయ అనుమతి నిరాకరించిన అంశంపై కేంద్ర విదేశీ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అధికారికంగా స్పందిం చారు. ముఖ్యమంత్రులు, ఇతర ఉన్నత స్థాయి ప్రముఖుల విదేశీ పర్యట నలకు పొలిటికల్ క్లియరెన్స్ ఇచ్చే ముందు మంత్రిత్వ శాఖ ఆయా కార్యక్రమాల స్వభావాన్ని లోతుగా పరిశీలిస్తుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ప్రతిపాదిత కార్యక్రమాలు సముచి తంగా ఉన్నాయా, అనే అంశాన్ని నిశితంగా అంచనా వేస్తామని పేర్కొన్నారు. ఈ నిర్దిష్ట సందర్భంలో అమెరికా పర్యటనకు సంబంధించిన ప్రతిపాదనలు ఆ ప్రమాణా లకు అనుగుణంగా లేకపోవడంతోనే అనుమతి నిరాకరించినట్లు స్పష్టం చేశారు. అయితే, ఆయన ప్రతిపాదించిన రెండు దేశాల పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్ డమ్ పర్యటనకు విదేశాంగ శాఖ ఇప్పటికే అధికారిక అనుమతి మంజూరు చేసిన విషయాన్ని రణధీర్ జైస్వాల్ గుర్తుచేశారు. అమెరికాలోని ప్రముఖ విశ్వ విద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు ఈ పర్యటనను ప్రతిపాదించినట్లు తెలంగాణ ప్రభుత్వం పేర్కొనగా.. పొలిటికల్ క్లియరెన్స్ రాకపోవడంపై కేంద్ర ప్రభుత్వ ప్రకటన చర్చనీయాంశంగా మారింది.

### తెలంగాణ రైజింగ్' ఆగదు: సీఎం రేవంత్

అమెరికా పర్యటన వాయిదా పడిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి తన అధికారుల బృందాన్ని యూఎస్ఏ వెళ్లి హార్వర్డ్, ఎంఐటీ, నార్త్-ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ వంటి అగ్రశ్రేణి విద్యా సంస్థలతో ఒప్పందాలు భాగస్వామ్యాలను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ మొత్తం పరిణామంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర యువత భవిష్యత్తు, తెలంగాణ అభివృద్దేతన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. 'ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ప్రయాణం ఆగదు' అని ఆయన ధీమా వ్యక్తం చేస్తూ సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్ గా మారుస్తామని అన్నారు. ఉస్మానియా, హెచ్సీ యు, జెఎన్టీయూ వంటి విశ్వవిద్యాలయాలు హైదరాబాద్ను మానవ వనరుల కేంద్రంగా మారాయని అన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రపంచానికి అత్యుత్తమ టెక్ నాయకులను అందిం చిందని తెలిపారు. ఐఐటీ, ఐఎస్ఐ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థలు గ్లోబల్ కార్పొరేషన్లను ఆకర్షించాయని పేర్కొన్నారు. అయితే, షెడ్యూల్ ప్రకారమే సీఎం రేవంత్ రెడ్డి యూరేలోని ఆక్స్ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. అక్కడి ప్రముఖ క్రీడా, నైపుణ్యాభివృద్ధి సంస్థలతో చర్చలు జరిపి ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. తన విదేశీ పర్యటన వికసిత్ భారత్కు దోహద పడుతుందని భావించినట్లు పేర్కొన్నారు. దేశ నిర్మాణం కోసం రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని నమ్ముతానన్నారు. ఇదే సమయంలో అమెరికా పర్యటన కొనసాగించాలని అధికారుల బృందాన్ని సీఎం ఆదేశించారు. అన్ని ఎంవోయూలు యథాతథంగా చేసుకోవాలని, వర్సిటీలతో భాగస్వామ్య ఒప్పందాలను ఖరారు చేసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర నూతన విద్యా విధానాన్ని అమలు చేయటమే తమ లక్ష్యమని.. ప్రపంచస్థాయి సంస్థలను తెలంగాణకు తీసుకురావటమే పర్యటన ఏకైక ఉద్దేశ్యంగా సీఎం వివరించారు. విదేశీ పర్యటనలో భాగంగా బ్రిటన్తో పాటు అమెరికాలో ఉన్న ప్రముఖ యూనివర్సిటీలను సందర్శించి విద్యా విధానం, స్కిల్ డెవలప్మెంట్ విషయంలో ఆయా దేశాలు ఎలాంటి విధానాలను అవలంభిస్తున్నాయనే దానిపై ముఖ్యమంత్రి అధ్యయనం చేయాల్సి ఉంది. పలు అంతర్జాతీయ యూనివర్సిటీలను సందర్శించే విధంగా షెడ్యూల్ను ఖరారు చేశారు. ప్రస్తుతం లండన్లో ఉన్న సీఎం.. అక్కడ ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ, లండన్ బిజినెస్ స్కూల్ను సందర్శించాల్సి ఉంది. 23 వరకు లండన్లో పర్యటించనున్న సీఎం.. అక్కడి నుంచి అమెరికాలోని బోస్టన్కు వెళ్లాల్సి ఉంది. ఈనెల 29 వరకు అమెరికాలో పర్యటించి... తిరిగి 30న హైదరాబాద్కు తిరిగి రావాల్సి ఉంది.

# ఆక్స్ ఫర్డ్కు ఆహ్వానం

## తెలంగాణలో విద్యా కార్యక్రమాల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి చర్చలు



**హైదరాబాద్ :** తెలంగాణలో విద్యా కార్యక్రమాల విస్తరణకు ఆక్స్ఫర్డ్ యూనివ ర్సిటీ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. తెలంగాణకు రైజింగ్ ప్రతినిధి బృందం విదేశీ పర్యటనలో భాగంగా శుక్రవారం లండన్లోని 900 ఏళ్ల చరిత్ర కలిగిని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ తో ఆక్స్ఫర్డ్ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి నాణ్యమైన విద్య, పరిశోధనా అంశాలు కల్పించే అంశాలపై అక్కడి ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్నిక్ స్కూల్ గవర్నమెంట్కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్ జీతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలను వారికి వివరించారు. హైదరాబాద్ను ప్రంపచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, అందుకు అనుగు ణంగా చేపడుతున్న చర్యల పురోగతిని వారికి వివరించారు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధనా సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్కు తరలించాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరాబాద్లో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధనా అవకాశాలను అందిం చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కీలక సమావేశంలో సీఎం కార్యా లయ సలహాదారు, ఎక్స్ అఫిషియో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభు త్వం జాతీయ విద్యావిధానం కింద విదేశీ విశ్వ విద్యాల యా లకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆక్స్ఫర్డ్ విద్యా వేత్తలకు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఉన్న అపార అవకా శాలు, లభించే ప్రయోజనాలను ఇందులో ప్రముఖంగా వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవజ్ సానుకూలంగాస్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్యా, పరిశోధనా, నైపుణ్యాభివృద్ధిరంగాల్లో భాగస్వా మ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్ర స్తావించారు. డిసెంబరు 7,8,9 తేదీల్లో హైదరాబాద్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి చారిత్రక సోమర్విల్ కాలేజీని సందర్శిం చారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. 2002 లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే. అనంతరం ముఖ్యమంత్రి అక్కడే జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంథితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. ఈ ప్రాం గణంలో గోల్ఫ్ కోర్స్ తోపాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, హోటల్ ఉ న్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల వృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. శు క్రవారం సాయంత్రం ప్రస్తుత ప్రీమియర్ లీగ్ చాంపియన్స్ ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే ఈపీఎల్ మ్యాచ్ను వీక్షించేందుకు ముఖ్యమంత్రి ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు.

# ఓటర్ జాబితా సవరణలు కోసం స్పెషల్ క్యాంపెయిన్ డేస్





శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం : జిల్లా కలెక్టర్
నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకొవాలి : జిఎంసి కమిషనర్

**గుంటూరు, 21 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ నెల 22, 23 తేదీలలోనూ 29, 30 తేదీల్లోను ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముసాయిదా ఓటరు జాబితా బి.ఎల్.ఓల వద్ద లభ్యంగా ఉందని, ఓటర్లు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకొనుటకు, వివరాల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయుటకు సంబంధిత పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓలను సంప్రదించి ఫారం 6, 7 లేదా 8 అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటును పదిలపరచుకోవాలని కోరారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి వచ్చే వారికి స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ, ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌లో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు ముసాయిదా ఓటర్ జాబితాతో పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటర్ జాబితాలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకోవాలనుకునేవారు, పేరు లేదా ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాలనుకునేవారు, అలాగే ముసాయిదా ఓటర్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నవారు సంబంధిత పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న బిఎల్ఓలను సంప్రదించి తమ దరఖాస్తులను అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌ను సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని, ఓటర్ జాబితాలో ఏవైనా తప్పులు లేదా మార్పులు అవసరమైతే నిర్ణీత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బిఎల్ఓలు నిర్దేశిత సమయంలో పోలింగ్ కేంద్రాల్లో ఉండి, ప్రజల నుండి అర్జీలు, దరఖాస్తులను తీసుకునేలా సూపర్వైజరీ అధికారులు, ఏఈఆర్ఓలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.




వాకింగ్ ట్రాక్ సభ్యత్వం పేరుతో లక్షలు వసూలు
అమృత స్కీం మరియు జిఎంసి నిధులతోనే అభివృద్ధి పనులు
వాకింగ్ ట్రాక్ ఆదాయం మాయం ?
సుమారు 40 లక్షల రూపాయలకు లెక్క ఏది ?
ప్రస్తుత కమిటీ అధ్యక్ష కార్యదర్శులకు సభ్యుల సూటి ప్రశ్న ?
అభివృద్ధి నిధుల పై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ శూన్యం ?

**గుంటూరు, 21 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగర అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వాకింగ్ ట్రాక్ లు పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్ మౌలిక వసతుల కల్పనకు భారీ నిధుల ప్రతిపాదనలు సిద్ధచేస్తుంటే.. మరోపక్క వాకింగ్ ట్రాక్ అభివృద్ధి నిధులు పక్కదారి పడుతున్నాయి. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ అభివృద్ధి నిధులలో అవకతవకలు జరిగినట్లు వాకింగ్ ట్రాక్ సభ్యులు గుసగుసలాడుకుంటున్నారు. సుమారు 60 లక్షల రూపాయలకు అభివృధి పనుల పేరుతో దారి మళ్ళీనట్లు వాకింగ్ ట్రాక్ సభ్యులు వాపోతున్నారు. కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ ప్రస్తుత అధ్యక్షుడు కన్నసాని బజ్జి వాకింగ్ ట్రాక్ సభ్యత్వం పేరుతో లక్షలు వసూలు చేశారని, పాత కమిటీ వారు ఉన్నప్పుడు మంజూరైన అమృత స్కీం మరియు జిఎంసి నిధులతోనే అభివృద్ధి పనులు చేసి, సభ్యత్వం పేరుతో వసూలు చేసిన లక్షల రూపాయలు లెక్క ఏది ? అని కమిటీ సభ్యులు అధ్యక్ష కార్యదర్శి ని నిలదీసినా సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని, ప్రస్తుత కమిటీ కాలపరిమితి ఈ నెల 24 వ తేదీన ముగియనున్న నేపధ్యంలో నిధుల మళ్లింపు విషయం స్థానికంగా చేర్చకు దారితీసింది.

**మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ శూన్యం ?**
గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వాకింగ్ ట్రాక్ లు పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యం మంచిదే.. కానీ, అభివృద్ధి నిధుల పై అధికారులు సమీక్ష నిర్వహించకపోవటం వల్ల అభివృద్ధి నిధులు దారి మల్లుతునాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

## నల్లచెరువు వాకింగ్ ట్రాక్ కు మహర్ధశ



**గుంటూరు, 21 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రెండు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న నల్లచెరువు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక నల్లచెరువు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.50 లక్షలతో ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ వాకింగ్ ట్రాక్ ఎత్తు పెంచడంతోపాటు మరుగుదొడ్లు, జిమ్, బ్యాడ్మింటన్ కోర్టు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రెండేళ్ల ఆకముందు నల్లచెరువు వాకింగ్ ట్రాక్ వద్ద ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారిని చెప్పారు. దీంతోపాటు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో ఒక్కొక్క వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి అంటే కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో పార్కులు స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు కల్పించబోతున్నామన్నారు


**వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సహకరించండి :** బిఆర్ స్టేడియం వద్ద శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకులు తొలగించి నూతనంగా నిర్మించబోతున్నామని, దీనికి ప్రజలు సహకరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బీఆర్ స్టేడియం వద్ద వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. నూతన ట్యాంక్ ఏర్పాటు క్రమంలో కొన్ని ప్రాంతాలకు మంచినీటి సమస్య తలెత్తుతుందన్నారు. సాధ్యమైనంత వరకు ప్రజలకు మంచి సేవలు అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు బెయిల్ మంజూరు కావాలని ప్రత్యేక ప్రార్థనలు



**గుంటూరు, 21 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పై కక్షతో అక్రమ కేసు నమోదు చేశారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు సందేటి రాజేష్ మండిపడ్డారు. మహమ్మద్ ముస్తఫా కు బెయిల్ మంజూరు కావాలని కోరుతూ శుక్రవారం పాత బస్టాండ్ మత్తయ్య చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ వ్యాపార సమస్యను ఆసరాగా చేసుకొని అక్రమ కేసు పెట్టడం దుర్మార్గమన్నారు. భగవంతుడు ఆశీస్సులు, దీవెనలతో త్వరగా బెయిల్ మంజూరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్,ధూపాటి సల్మాన్, జ్యోతి బాబు, ధూపాటి వంశీ, ఇర్మియా, అనిల్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 23 నుంచి పారదర్శకంగా ఏఈఈల నియామక పరీక్షలు



ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి

**గుంటూరు, 21 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీ క్షలు నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయి. మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఫోటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఫేస్ వెరిఫికేషన్, మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, కాగితాలు అనుమతించబోమన్నారు. ఉద్యో గం ఇప్పిస్తామంటూ దళారులు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సీఎండీ సూచించారు.



## విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**గుంటూరు, 21 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ రాజేంద్రనగర్ మరియు నలంద నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది కనుక వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పటాన్ హుస్సేన్ ఖాన్ మరియు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ గురవయ్య ఒక సంయుక్త ప్రకటనలో శుక్రవారం తెలియజేశారు.

## తాగునీటికి తూర్పులో తిప్పలు





**గుంటూరు, 21 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బి.ఆర్. స్టేడియం సమీపంలోని మంచినీటి ట్యాంకులు, ముఫ్తీ మొహల్లా ప్రాంతాల్లో వైసీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పర్యటించి పరిస్థి తిని పరిశీలించారు. మంచినీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారుల నిర్ల క్ష్యం పై ఫాతిమా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస తాగునీరు అందించడంలోనూ సమస్యలు తలెత్తడంపై అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా పరిస్థితిని మెరుగుపరచి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె కోరారు.

## గుంటూరులో వైభవంగా శ్రావణ మాసం వేడుకలు



**గుంటూరు, 21 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** శ్రావణ మాసం వేడుకలు గుంటూరులో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 2వ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మి వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయాలు కళకళలాడాయి. వేద మంత్రోచ్చారణ, విశేష పూజలతో వరాల లక్ష్మిని కొలిచారు. శ్రావణ శుక్రవారం నాడు దైవ దర్శనం చేసుకున్న భక్తులకు సకల శుభాలు కలుగుతాయని పండితులు తెలిపారు.

## పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుద్దాం: మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు




**గుంటూరు, 21 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉంటేనే అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం గుంటూరులోని టీటీడీ కళ్యాణ మండలంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు పరిచయ సభ కార్యక్రమం జరిగింది. అనంతరం మీడియాతో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి హనుమంతరావు మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రభుత్వ, కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో శాసన మండలిలో ఉద్యోగుల సమస్యలపై మాట్లాడే అభ్యర్థి ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

## రైతాంగానికి సమృద్ధిగా సాగునీరందించాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్




**ఇబ్రహీంపట్నం, 21 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న 118 ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతాను ఆయన ఇబ్రహీంపట్నంలో ప్రారంభించారు.

**ముఖ్య డిమాండ్లు ఎత్తిపోతల పథకాలు :** జిల్లాలోని పెండింగ్ లో ఉన్న 118 ఎత్తిపోతల పథకాలను వెంటనే పూర్తి చేయాలి. సాగునీరు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా సాగునీరు అందించాలి. సీపీఐ ఆధ్వర్యంలో జీపు జాతాను ప్రారంభించిన ప్రధాన ఉద్దేశం రైతాంగ సాగునీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం మరియు ప్రాజెక్టుల పూర్తికి డిమాండ్ చేశారు.

## సంయోచితమైన సహాయం అందిస్తున్న ఇనకొల్లు పోలీసురావు



**బాపట్ల, 21 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సంయోచితమైన సహాయాన్ని అందిస్తున్న కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇన కొల్లు పోలీసురావు శుక్రవారం కంకటపాలెం గ్రామంలో ఇల్లు కాలిపోయిన వారికి దుస్తులు, నిత్యవసర సరుకులు, బియ్యం మొదలగునవి అందించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహితుడు బొంత శామ్యూల్ త్యాగరాజు సహకారంతో ఈ సహాయాన్ని అందించామని ఆయన తెలిపారు. ఇల్లు కాలిపోయిన జుట్టురి శ్రీనివాసరావు, ఓ చూరి పిచ్చయ్య రెండు కుటుంబాలకు చేయూతనిచ్చారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరు బాధ్యత అన్నారు. బాపట్ల జిల్లాలో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగిన శామ్యూల్ త్యాగరాజ్ తనవంతు సహకారాన్ని అంది స్తున్నారని అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణ జీవన్ మినిస్ట్రీస్ కోశాధికారి కనపర్తి రాజారావు, శ్రీనివాసరావు, కోటయ్య రచనలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు

### మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, భారత్ ప్రతినిధి న్యూస్ :** సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం చేపట్టిన గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌తో సంబంధిత అధికారులు మాట్లాడి సెర్చ్ ఆపరేషన్ పురోగతిని తెలుసుకున్నారని మంత్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం 5 నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, ఒక హెలికాప్టర్‌తో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు తెలియజేశారన్నారని వెల్లడించారు. మత్స్యకారుల బోటుకు సంబంధించిన సమాచారాన్ని మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్‌తోపాటు బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంతాల్లోని కోస్ట్‌గార్డ్ అధికారులకు చేరవేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనూ బోటు ఆచూకీ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బోటు ఆచూకీ లభించనప్పటికీ, సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి విరామం ఉండదని స్పష్టం చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 21 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అదే విధముగా జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళామాధవి ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అదే విధంగా గురువారం జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయటంతోపాటు, వారి సమస్యలను పరిష్కరించాలని కోరటం పై హర్షం వ్యక్తం చేస్తూ పలు జర్నలిస్ట్ సంఘాల ఎమ్మెల్యేని కలుసుకొని ధన్యవాదాలు తెలిపి, సత్కరించారు.

**ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ**, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటుండటంతో ప్రజలు సంతృప్తిగా వెళ్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రతి వర్గం, ప్రతి వృత్తి, ప్రతి సంస్థ అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో జర్నలిస్టుల సంక్షేమంపై తాను ప్రస్తావించిన అంశాన్ని వివరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు నిజమైన సమాచారాన్ని చేరవేసేందుకు ఎన్నో కష్టాలు, ప్రమాదాలను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులకు కనీస భద్రత, సంక్షేమం అవసరమని పేర్కొన్నారు.

అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయం, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు కల్పించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. జర్నలిస్టులు చాలా తక్కువ వేతనాలతో, నిరంతర ఒత్తిడిలో పనిచేస్తున్నప్పటికీ సమాజానికి సేవ చేస్తున్నారని అన్నారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా గృహ వసతి, ఆరోగ్య భద్రత అందించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారని, జర్నలిస్టు కాలనీల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. జర్నలిస్టుల కోసం గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేసి, వారి సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదేళ్లలో అనేక వర్గాల మాదిరిగానే జర్నలిస్టుల సమస్యలు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రతి వర్గం సమస్యలపై దృష్టి సారిస్తోందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయాలు లేదా ఇంటి స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరినట్లు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో హౌసింగ్ వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నప్పటికీ, ప్రతి వర్గానికి న్యాయం చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తారనే నమ్మకం ఉందని, రానున్న రోజుల్లో జర్నలిస్టుల హౌసింగ్, హెల్త్ కార్డుల అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి అనే మూడు లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరించి కొంత సమయం ఇస్తే ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విశ్వాసం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టుల తరపున గళం వినిపించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ఏపీడబ్ల్యూజేఎఫ్ ధన్యవాదాలు



**గుంటూరు, 21 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** జర్నలిస్టుల సమస్యలను ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రస్తావించి, అక్రిడిటేషన్ కలిగినజర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) గుంటూరు జిల్లా కమిటీ ధన్యవాదాలు తెలిపింది. జర్నలిస్టుల సమస్యలపై ఏపీడబ్ల్యూజేఎఫ్ చేసిన వినతిని స్వీకరించి, వారి డిమాండ్లకు మద్దతుగా అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యే గల్లా మాధవికి జిల్లా కమిటీ సభ్యులు శుక్రవారం కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, వారి కుటుంబాల భవిష్యత్‌కు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ సౌకర్యం కల్పించాలన్న డిమాండ్‌ను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం పట్ల ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. జర్నలిస్టుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే గళ్ళా మాధవి భవిష్యత్తులోనూ ఇదే విధంగా సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.సాయికుమార్, ప్రధాన కార్యదర్శి పి.హరీష్, కార్య నిర్వహక కార్యదర్శి స్వచ్ఛంద ప్రసాద్, శ్యామ్యూల్, షేక్ కాలేషావలి, విజయ్ ధనరాజ్, యద్దనపూడి ఆరుద్ర, తిమ్మిరి శంకర్, పి. కోటేశ్వరరావు, ఓ.నాగ తదితరులు పాల్గొన్నారు.

# మూలపాడులో క్రికెట్ క్రీడా పోటీలు ప్రారంభం

### పోటీలను ప్రారంభించిన విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్





**ఇబ్రహీంపట్నం (మూలపాడు), 21 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ఉద్యోగుల ప్రీమియర్ లీగ్ క్రికెట్ క్రీడా పోటీలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. యునైటెడ్ తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పోటీలను మూలపాడులోని ఏసీఏ స్టేడియంలోవిజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు జరిగిన మ్యాచ్ లో మొదటిగా గ్రౌండ్ ఏ లో ఇరిగేషన్ ఏ, ఇరిగేషన్ బి టీ పోటీ పడ్డాయి. గ్రౌండ్ బి లో ఎడ్యుకేషన్, రెవిన్యూ మొదటి మ్యాచ్ ముగించారు. రెండో మ్యాచ్ వచ్చేసరికి ఏ గ్రౌండ్ లో పంచాయతీరాజ్, సెక్రటేరియట్ స్ట్రైక్, బి గ్రౌండ్ లో ఏపీ ఎన్జీవోటు వర్సెస్ విఎంసి XI ఆడగా ఉదయం జరిగిన ఆమ్యాచ్ లో ఇరిగేషన్ బి గెలుపొందారు. బి గ్రౌండ్ లో ఎడ్యుకేషన్ టీం గెలుపొందారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ లో ఏ గ్రౌండ్ లో పంచాయతీ రాజ్ గెలుపొందారు. బి గ్రౌండ్ లో విఎంసి గెలుపొందారు. రేపు ఉదయం ఏపీ ఎన్జీవో 1, సెక్రటేరియట్ స్ట్రైకర్, టీములు మ్యాచ్ ఆడనున్నాయి.

# ఎల్.కోటకు సీఎం నారా చంద్రబాబు నాయుడు రాక

### ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు





**ఎల్.కోట, 21 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఎస్.కోట (ఎల్.కోట) నియోజకవర్గంలో పర్యటించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుమార్తె వివాహం ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో, సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా విచ్చేసి వధువును ఆశీర్వదించనున్నారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని అధికారులు, పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. సీఎం పర్యటన నేపథ్యంలో సంబంధిత అధికారులు భద్రత మరియు ఇతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ స్వయంగా పర్యటించి హెలీ ప్యాడ్ ప్రాంతాన్ని, ముఖ్యమంత్రి కాన్వాయ్ మార్గాలను మరియు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఎటువంటి భద్రతా లోపాలు తలెత్తకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికా రులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయ కులు కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, పలువురు జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# దళిత గిరిజన పేటలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి

### సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు

### కుంచనపల్లి లో సామాజిక శంఖారావం జీపు ప్రచార యాత్ర ప్రారంభం

**తాడేపల్లి రూరల్, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రంలో దళితులు, గిరిజనులు నివాస ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామంలో శుక్రవారం సామాజిక శంఖారావం జీపు జాతను స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ.. కుల వివక్ష లేని సమాజం కావాలని, దళితులు గిరిజనులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల రోజుల కాలంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, సిఐటియు ఆధ్వర్యంలో విస్తృతంగా సర్వేలు జరిగాయని అన్నారు. నేటికీ దళితపేటలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం నాయకులు అధికారం లోకి రాకముందు అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని, అధికారంలోకి వచ్చాక పేదల సమస్యలు పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది గ్రామాలలో ప్రజా సంఘాల నాయకులు నిర్వహించిన సర్వేలలో దళితపేటలలో కనీస సౌకర్యాలు మౌలిక వసతులు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహించే మంగళగిరి నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ లేక మంచినీటి సమస్య, మురుగు సమస్యలతో దళితులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భూగర్భ జలాలు కలుషితమై కుంచనపల్లి వంటి ప్రాంతంలో పేదలు మంచినీరు కొనుక్కునే పరిస్థితి దాపురించిందన్నారు. ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచి దుర్గంధం వెదజల్లుతున్న దోమలు ప్రబలుతున్న పట్టించుకునే నాధుడే లేరని ఆయన విమర్శించారు. వందలాది కోట్ల నిర్మాణంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని శిలాఫలకం వేశారని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ఎప్పుడు చేపడతారో లోకేష్ సమాధానం చెప్పాలన్నారు. శిలాఫలకాలతో సరిపెడతారా? దళిత పేటలో అభివృద్ధి చేస్తారా కూటమి ప్రభుత్వం నాయకులు సమాధానం చెప్పాలన్నారు. స్మశాన స్థలాలు లేక రాష్ట్రంలో అనేక గ్రామాలలో ఉన్నదాంట్లో శవాల మీద శవాలు పెట్టుకునే పరిస్థితి దళితులకు నేడు ఏర్పడిందన్నారు. రాజధాని ప్రాంతంలో ముఖద్వారంగా ఉన్న తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో ఇంటి స్థలం కోసం, ఇళ్ల పట్టా కోసం వేలాదిమంది దరఖాస్తులు చేసుకుంటే 3,000 మందికి మాత్రమే ప్రభుత్వం ఇచ్చిందన్నారు.

# రాహుల్ తెలంగాణలో ధర్నా ఎప్పుడు..

**ఢిల్లీలో ఒక నీతి.. ఇక్కడో నీతా?**

**రేవంత్‌రెడ్డి సర్కార్ లాఠీచార్జ్‌పై ఎందుకు ప్రశ్నించరు?**

**విద్యార్థులపై నిజంగా ప్రేముంటే హైదరాబాద్‌లో ధర్నాకు రా..**

**రాహుల్‌కు ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్**

**హైదరాబాద్, ఆగస్టు 21** : విద్యార్థుల కోసం ఢిల్లీలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండపై ఎప్పుడు ధర్నా చేస్తారో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌ను ప్రశ్నిస్తూ బాధిత విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్టు నాటకాలు ఆడే రాహుల్‌గాంధీ, తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ విద్యార్థులపై చేస్తున్న దమనకాండపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. ఢిల్లీలో ధర్నా సరే.. హైదరాబాద్‌లోని సీఎం రేవంత్ ఇంటి ముందు ఎప్పుడు ధర్నాకు వస్తారో చెప్పాలని ప్రశ్నించారు. విద్యార్థులపై ఎక్కడ దాడి జరిగినా ఖండించాల్సిన బాధ్యత రాహుల్‌గాంధీపై ఉన్నదని పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కులు ఢిల్లీలోని విద్యార్థులకేనా..? తెలంగాణ విద్యార్థులకు వర్తించవా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో విద్యార్థులపై లాఠీచార్జ్ జరుగుతున్నా, ఈడ్చుకెళ్తున్నా, వారి హక్కులను కాలరాస్తున్నా రాహుల్‌గాంధీ స్పందించకపోవడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని విమర్శించారు. తెలంగాణలో పోలీస్ లాఠీలపై కాంగ్రెస్ పార్టీ గుర్తు ఉన్నందుకే ఆయన మౌనంగా ఉంటున్నారని ఎద్దేవాచేశారు

**రాజకీయాలకు అతీతంగా నిలబడుతారా?**

తెలంగాణలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను కూడా రాహుల్ ఖండించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల హకుల విషయంలో రాజకీయాలకు అతీతంగా నిలబడుతారా?.. సర్కార్ దమనకాండకు రాజకీయ రక్షణ కల్పిస్తారా? అని రాహుల్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో సర్కార్ దాష్టీకంపై స్పందించకుంటే విద్యార్థులపై రాహుల్‌ది కపట ప్రేమేనని రాష్ట్ర ప్రజలు భావించాల్సి వస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు

**సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ**

**హైదరాబాద్,ఆగస్ట్20** : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు నడుస్తోంది అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఇటీవల కాలంగా తెలంగాణ కాంగ్రెస్ నేతల అంతర్గత కలహాల వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుం దన్నారు. రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, ఏ తప్పూ చేయకుండా ఉంటేనే మంత్రులు, కిందిస్థాయి అధికారుల్లో భయం ఉంటుంది. ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి పాలనపై దృష్టిపెట్టాలని పరోక్షంగా సూచించారు. 22ఏ భూముల నిబంధనను కొందరు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదు, ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని పేర్కొన్నారు. తమ సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తిపెరుగుతుందన్నారు.

# తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

**హైకోర్టులో ముగిసిన వాదనలు.. 16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు**

**హైదరాబాద్,ఆగస్ట్21** : తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఃఔ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# కల్తీకల్లు, ఆల్ప్రాజోమ్ నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

**ఏకంగా రూ.6 కోట్ల విలువైన ఆస్తులను జప్తు**

**హైదరాబాద్,ఆగస్ట్21** : తెలంగాణలో కల్తీకల్లు, ఆల్ప్రాజోలం అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై తెలంగాణ ఈగల్ ఫోర్స్ , బోధన్ పోలీసులు ఉమ్మడిగా విరుచుకుపడ్డారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించిన భారీ అంతర్రాష్ట్ర డ్రగ్ సిండికేట్‌ను మట్టుబెట్టడమే కాకుండా, డ్రగ్స్ వ్యాపారంతో అక్రమంగా సంపాదించిన ఏకంగా రూ.6 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 15 మంది కీలక నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డ్రగ్స్ ద్వారా వచ్చిన నల్లధనంతో కూడబెట్టిన ఆస్తులపై ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 68(ఈ) ప్రకారం పోలీసులు చర్యలు చేపట్టారు. నిందితులకు చెందిన 9.06 ఎకరాల వ్యవసాయ భూమి, 1,370 చదరపు గజాల ప్లాట్లతో పాటు రవాణాకు ఉపయోగించిన వాహనాలు , మహారాష్ట్రలోని కెమికల్ ఫ్యాక్టరీని అధికారులు జప్తు చేశారు. ప్రభుత్వ లెక్కింపు ప్రకారం వీటి విలువ రూ.2.5 కోట్లు కాగా, ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ.6 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్, మెదక్ , సిద్ధిపేట జిల్లాల్లో కల్తీకల్లుకు ఆల్ప్రాజోలం కెమికల్ వినియోగిస్తున్నట్లు పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. నస్రుల్లాబాద్‌లో కల్తీకల్లు తాగి 68 మంది, గాంధారి ప్రాంతంలో 15 మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఈ అంతర్రాష్ట్ర దందా వెలుగులోకి వచ్చింది. సిద్ధిపేటలో కల్తీకల్లుపై మూడు కేసులు నమోదు కాగా, జహీరాబాద్ లో నిఫా పెట్టి 750 గ్రాముల ఆల్ప్రాజోలం, రూ.7.50 లక్షల నగదుతో పాటు క్రెటా కారును అధికారులు సీజ్ చేశారు. బోధన్ పరిధిలో జరిపిన మెరుపు దాడిలో రూ.25 లక్షల విలువైన 2.5 కిలోల ఆల్ప్రాజోలం, ఒక కారు, రూ.25 లక్షల నగదు , 8 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ లభించిన కీలక ఆధారాల ఆధారంగా మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చేరుకున్న పోలీసులు 'సూర్య ప్రభ ఫార్మా కెమ్'ఫ్యాక్టరీపై దాడి చేశారు. అక్కడ అక్రమంగా తయారు చేస్తున్న 30 కిలోల ఆల్ప్రాజోలంతో పాటు రూ.12 లక్షల నగదు , సుమారు రూ.4 కోట్ల విలువైన కెమికల్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఒక్క ఆపరేషన్‌లోనే 32.5 కిలోల ఆల్ప్రాజోలం నిల్వలను పోలీసులు రికవరీ చేశారు. డ్రగ్ వ్యాపారం చేస్తూ అక్రమ మార్గాల్లో ఆస్తులు కూడబెడితే ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదని, వారి ఆస్తులన్నింటినీ సీజ్ చేస్తామని ఈగల్ ఫోర్స్ అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**సవాళ్లను అవకాశంగా మార్చుకోవాలి**

**అక్టోబర్, నవంబర్ నెలలు అత్యంత కీలకం..**

**పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రాకుండా చూడాలి**

**భూగర్భ జలాలను అంచనా వేసి, ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాలి**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల కష్టాలను తీర్చాలి**

**వర్క్‌షాపులో పలువురు మంత్రుల సూచన**



**హైదరాబాద్,ఆగస్ట్21** : ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్నిఅన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో

సమావేశం ఏర్పటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు ప్రజలతో మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు. ౖ÷తులను ఒకే పంటపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తూ ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చినా రైతుకు నష్టం రాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని సూచించారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, వక్క, మిరియాలు వంటి అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించవచ్చన్నారు. ౖ÷లంగాణను దేశంలోనే ఆయిల్‌పామ్ సాగులో అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అన్ని జిల్లాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, రైతులకు లాభదాయకమైన వ్యవసాయాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉద్యాన రంగాన్ని కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి తెలంగాణను పొరుగు రాష్ట్రాలకు దీటుగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ౖ÷తుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుగానే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం తదితర అంశాలపై నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. గత ఆరు నెలలుగా వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు రైతాంగ సమస్యలపై నిరంతరం చర్చిస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో పశువులు, అటవీ జంతువులకు కూడా నీటి లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గతంలో కరువు పరిస్థితుల్లో గ్రామాల వెలుపల పశువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేసినట్లుగానే, అవసరమైతే అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు కూడా నీటి సదుపాయం కల్పించాలని అన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడుతూ అన్ని జీవులు సమానంగా జీవించే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతులను నిలబెట్టగలిగే శక్తి రాష్ట్రానికి ఉండాలి' అనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిసి పనిచేయాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. 'ప్రతి గ్రామానికి నీటి బ్జడెట్ ? ప్రతి రైతుకు నీటి భద్రత ? ప్రతి ఎకరానికి వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం' అనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కోరారు.

# కొండా సురేఖపై వేటు వేయండి

**రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల డిమాండ్**




**హైదరాబాద్** : కాంగ్రెస్ పార్టీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత పటేల్ చేసిన అనుచిత వ్యాఖ్యల వెనుక అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నారని, ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. కూతురు చేసిన విమర్శలపై కొండా సురేఖ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే వేటు వేయాలని పార్టీ అధిష్టానానికి సూచించారు. సీఎం రేవంత్రెడ్డి కేబినెట్లో మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తెలియకుండా ఆమె కూతురు ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. తన కూతురు వ్యాఖ్యలను తనకు ఆపాదించవద్దని చెప్పి తప్పించుకోలేరని ఘాటుగా విమర్శించారు. సుస్మితపటేల్ వ్యాఖ్యలతో సంబంధం లేకపోతే ఆమె వ్యాఖ్యల ను ఎందుకు ఖండించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పార్టీ లైన్ కు వ్యతిరేకంగా సీఎంపై విమర్శలు చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి చిన్నారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న వారిపై టీపీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. శుక్రవారం సీఎల్పీ మీడియా హాలులో 19 మంది ప్రభుత్వ విప్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విప్లు బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు వీర్లపల్లిశంకర్, నాయిని రాజేందర్ రెడ్డి, బాలూ నాయక్, వెడ్మబొజ్జు మీడియాతో మాట్లాడారు. ఈ స మావేశంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగ రాజు, గండ్ర సత్యనారాయణ రావు, మందుల సామేల్, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ రాజేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయ్ వీర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై ఎవరు విమర్శలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం నిర్ణయాలను తప్పుప ట్టే వాళ్లకు పార్టీలో ఉండే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారిన కొండా సురేఖను ప్ర భుత్వం నుంచి, పార్టీ నుంచి తప్పించాలని వేముల వీరేశం డిమాండ్ చేశారు. తన కూతురు వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని అంటున్న కొండా సురేఖ ఆ వ్యాఖ్యలను ఎందుకు ఖండించడం లేదు? రాష్ట్ర మంత్రిగా ఆ వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కొండా సురేఖ కుటుంబ సభ్యుల భాష ఎప్పుడూ పార్టీకి తలనొప్పిగా, నష్టం కలిగించేలా ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి రక్తం ధారపోసిన వ్యక్తి, చెమటోడ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి. అని అంతే గాక ఆయన సోదరులు కూడా అధికారంలోకి రావడానికి చెమటోడ్చారని వేముల వీరేశం గుర్తుచేశారు. పార్టీ వేదికపై ఎవరైనా తమ అభిప్రాయాలను చెప్పు రోవచ్చు. కానీ, బయట సీఎంపై తప్పుడు వ్యాఖ్యలు చేసినా, ఏకవచనంతో మాట్లాడినా సహించ బోమని హెచ్చరించారు. రేవూరి ప్రకాష్ రెడ్డిపై నీచమైన భాష మాట్లాడుతున్నారని, తాగుబోతుల్లా బజార్లలోకి వచ్చి మాట్లాడితే అది బజారు సంస్కృతి అవుతుందే తప ప కాంగ్రెస్ సంస్కృతి కాదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డిపై మాట్లాడిన మాటలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకపోతే కార్యకర్తల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరిం చారు. బీఆర్ ఎస్ ఆడుతున్న డ్రామాలో కాంగ్రెస్ పార్టీ నేతలు పడొద్దని వేముల వీరేశం విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి (వరంగల్ పశ్చిమ)మాట్లాడుతూ, పార్టీనుంచి బహిష్కరించకముందే రాజీనామా చేసి వెళ్లాలని కొండా సురేఖను డిమాండ్ చేశారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్.. మళ్లీ కాంగ్రెస్కు వచ్చారని, ఎక్కడైనా సరిగ్గా ఉన్నారా? కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు బీఫాంలు కూడా ఎత్తుకుపోయారని, అయినా మంత్రి పదవి ఇస్తే మీరిచ్చే గౌరవం ఇదేనా? కూతురు వ్యాఖ్యలతో మీకు సంబంధంలేదా? అని రాజేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనే కొండా దంపతులపై టీపీసీసీకి అనేకసార్లు ఫిర్యాదు చేశామని, గతంలో క్షమిం చాం.. ఎన్ని సార్లు క్షమించాలని వ్యాఖ్యా నించారు. కొండా సురేఖ ఒక్కరే కాదు.. రాజగోపాల్ రెడ్డి ఎవరినీ క్షమించవద్దు, తన బిడ్డ బాధ్యతను కొండా సురేఖ తీసుకుని రాజీనామా చేయాలని, లేకపోతే పార్టీయే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీర్ల అయిలయ్య మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. తన కూతురు చేసిన విమర్శలపై కొండా సురేఖ స్పందించాలని డిమాండ్ చేశారు. అంతర్గత విషయాలను సీఎల్పీలో గానీ, టీపీసీసీ, ఏఐసీసీ ఇతర వేదికల్లో గానీ మాట్లాడాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 89 వేల మందికి సంబంధించిన భూములు 22 ఏనిషేధిత జాబితాలో! ఉన్నా యని, వాటిని పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటా మని రెవెన్యూశాఖ మంత్రి హామీ ఇచ్చారని అయిలయ్య వెల్లడించారు. ఎమ్మెల్యే బాలూ నాయక్ (దేవరకొండ మాట్లాడుతూ, పార్టీ క్రమ శిక్షణకు విరుద్ధంగా వ్యవహ రించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేలాది మంది కార్యకర్తలు రక్తం చిందించి రేవంత్ రెడ్డి సారథ్యం లో పార్టీని అధికారంలోకి తెచ్చారని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కొండా సురేఖ కూతురు మాట్లాడిన తీరును కార్యకర్తలు అసహ్యించుకుంటున్నారని, సీఎంను బలహీనపర్చాలన్న కుట్రను వీళ్లు అమలు చేస్తున్నా రని నిప్పులు చెరిగారు. చిన్నారెడ్డి, రాజగోపాల్ రెడ్డితో పాటు తాను కూడా అనుచిత వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తీసు కోవాల్సిందేనని డిమాండ్ చేశారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై షోకాజ్ నోటీసుతో వదిలేయొద్దు.. కఠిన చర్యలు తీసుకోవాలని, అందుకు కులం, హోదాతో సంబంధం లేకుండా కఠిన చర్యలు ఉండాలని సూచించారు. అంతర్గత అంశాలను సోనియా, రాహుల్, ఖర్గే వద్ద మాట్లాడుకోవచ్చు. కానీ బహిరంగ విమర్శలు చేస్తే ఒప్పుకోమన్నారు. రేవంత్ రెడ్డి బలహీనపడితే పార్టీ మొత్తం బలహీనపడుతుందని, బలహీనపర్చే కుట్రలు బీజేపీ, బీఆర్ఎస్ సాధ్యం కావడం లేదని కొండా సురేఖ కుటుంబ సభ్యులతో చేయిస్తున్నారని విమర్శలు గుప్పించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, కొండా సుస్మిత అనే పిల్లకాకి మాట్లాడిన మాటలు ఆమెవి కాదు.. ఆమెతో కొండా సురేఖ మాట్లా డించారని ఆరోపించారు. గతంలో కూడా ముఖ్యమంత్రిపై విమర్శలు చేశారని. సీనియర్ నేత రేవూరి ప్రకాష్ రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడారని ఈ వ్యవహారంపై కొండా సురేఖ దాటవేసేధోరణిలో ఉన్నారని ధ్వజమెత్తారు. తన బిడ్డ అడ్డగోలుగా మాట్లాడితే మందలించకుండా నా తప్పిదం కాదని కొండా సురేఖ తప్పించుకుంటున్నారని వెడ్మబొజ్జు నిప్పులు చెరిగారు. షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వంలో భాగస్వామిగా కొండా సురేఖ ఉన్నారని, ఆమె కూతురు పార్టీని, సీఎం ను ఇబ్బందిపె ట్టేలా వ్యాఖ్యలు చేయడం సహించ రాని విషయమని అన్నారు. బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ, పార్టీకంటే పెద్ద. మా వల్లనే కాంగ్రెస్ గెలిచిందని అనుకుంటే సహిం చమన్నారు.

# రాహుల్ మెరుపు ధర్నా

- దిగొచ్చిన పోలీసులు
- పెల్లెట్ గన్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు
- 5 గంటల పాటు పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్లో రాహుల్ గాంధీ ధర్నా
- పాల్గొన్న ప్రియాంక గాంధీ, బాధితుడు సాహిల్
- జులై 20న జెన్ జీ నిరసనల్లో తీవ్రంగా గాయపడ్డ సాహిల్
- ఎయిమ్స్ నివేదికను బయటపెట్టిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మెరుపు ధర్నాతో పోలీసులు దిగివచ్చారు. జెనే పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పెల్లెట్ గన్ గాయాలకు గురైన ఓ విద్యార్థి ఫిర్యాదుపై ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. గత జూలై 20న జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోజాబ్ తీవ్రంగా గాయపడ్డాడు. పెల్లెట్ గన్ కాల్పుల వల్లే తాను గాయపడినట్లు అతను ఆరోపించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎఫ్ ఐఆర్ నమోదుచేయడంలో నిర్లక్ష్యం వహించారని బాధిత విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న రాహుల్ గాంధీ శుక్రవారం బాధితుడు సాహిల్, అతని తల్లితో కలిసి పార్లమెం ట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్కు వెళ్లారు. డీసీపీతో చర్చలు జరిపిన అనంతరం, కేసు నమోదు చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని తేల్చిచెబుతూ పోలీస్ స్టేషన్ వెలుపల రహదారిపైనే రాహుల్ బైకాయించారు. రాహుల్ గాంధీ ధర్నా వార్త తీవ్ర సంచలనం సృష్టించింది. విషయం తెలుసుకున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా, సీనియర్ నేతలు జైరామ్ రమేష్, రణదీప్ సుర్జేవాలా సహా భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు.

### 5 గంటల పాటు ధర్నా

ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు కదిలేది లేదని స్పష్టం చేస్తూ అక్కడే దాదాపు 5 గంటల పాటు చైకాయించారు. ఎస్ఐఆర్ నమోదు చేయకపోతే 30 రోజులైనా, 6 నెలలైనా సరే పోలీస్ స్టేషన్ బయటే ధర్నా చేస్తానని రాహుల్ గాంధీ పోలీసులను హెచ్చరించారు. పెల్లెట్ల కారణంగా అతని శరీరంలో తీవ్ర గాయాలయ్యాయని, ఒక కంటి చూపుపైనా ప్రభావం పడిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బాధితుడు ఫిర్యాదు. చేసినప్పటికీ ఎస్ఐఆర్ నమోదు చేయకపోవడం అత్యంతఅన్యాయం. కేసు దర్యాప్తు అధికారి వివరాలు కూడా చెప్పకపో వడం వెనుక ఉద్దేశం ఏంటి? అని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఇవి పెల్లెట్లు.. వీటిని చూడండి.. ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి? అని పృశ్నిస్తూనే.. ఇవి ఈ విద్యార్థి శరీరం నుంచి వచ్చాయి అని రాహుల్ సమాధానమి చ్చారు. గాయాలను చూపించమని సూచించగా.. సాహిల్ తన టీ-షర్టు చేతిని పైకి మడిచి గాయాలను చూపించాడు. అతని శరీరం లోపల 200 పెల్లెట్లు ఉన్నాయి.. మూడు పెల్లెట్లు అతని కంటిలో ఇరుక్కుపోయా యి అని గాంధీ చెప్పారు. ఆ తర్వాత ఆయన లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్, ఎయిమ్స్ నుండి వచ్చిన నివేదికలను ప్రదర్శించారు..

### పోలీసుల దిద్దుబాటు చర్యలు

ఇదిలా ఉండగా, ఈ ఘటనపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతోందని, సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ కూడా ఆందోళనల సమయంలో బలప్రయోగంపై పరిశీలిస్తోందని, ప్రత్యేక విచారణ కమిటీ కూడా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపినట్లు సమాచారం. ఎట్టకేలకు దిగివచ్చిన ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్ ఘటనపై ఎస్ఐఆర్ నమోదు చేశారు. బాధితుడి నుండి వైద్య నివేదిక, ఇతర సంబంధిత పత్రాలను పోలీసులు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగానే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నేతల ఆందోళనతో తీవ్ర ఒత్తిడికి గురైన పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్ పోలీసులు, ఎట్టకేలకు విద్యార్థి గాయపడిన ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్ఐఆర్ కాపీ ప్రక్రియ ప్రారంభించామని పోలీసులు హామీ ఇవ్వడంతో వివాదం తాత్కాలికంగా సమసి నస పోయింది. రాహుల్ గాంధీ తన ధర్నాను విరమించారు.

# హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

### జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రం కోర్టు

**న్యూఢిల్లీ,ఆగస్ట్21 :** హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# వ్యవసాయం, పర్యావరణ రంగాల్లోకి విస్తరించండి..

### అంతరిక్ష రంగంలో ప్రపంచ స్థాయి కేంద్రంగా భారత్ను తీర్చిదిద్దండి

### ప్రపంచ స్థాయి ప్రతిభావంతులను, సంస్థలను, పెట్టుబడులను ఆకర్షించండి

### అంతరిక్ష స్టార్టప్ల సీఈఓలు, ప్రతినిధులకు మోడీ పిలుపు



**న్యూఢిల్లీ:** అంతరిక్ష సాంకేతికతను రాకెట్లు, ఉపగ్రహాలకే పరిమితం చేయకుండా ప్రజల రోజువారీ జీవితాన్ని మెరుగుపరిచేలా విస్తృతంగా వినియోగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంతరిక్ష స్టార్టప్లకు పిలుపునిచ్చారు. వ్యవసాయం, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో స్పేస్ టె క్నాలజీని ఉపయోగించాలని సూచించారు. న్యూఢిల్లీలోని సేవా తీర్థ శుక్రవారం 20 అంతరిక్ష స్టార్టప్ల సీఈవో లు, వ్యవస్థాపకులతో మోడీ సమావేశమయ్యారు. రాకెట్ల తయారీ, పునర్వినియోగ ప్రయోగ వాహనాలు. ఉపగ్రహాలు, ప్రొపల్షన్ వ్యవస్థలు, అంతరిక్షనిఘా, స్పేస్ డెబ్రిస్ తొలగింపు, ఏఐ ఆధారిత వాతావరణ సాంకేతికత వంటి రంగాల్లో పనిచేస్తున్న సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. వ్యవసాయ రంగంలో పనిచేసే స్పేస్ స్టార్టప్లు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ విభాగాలతో కలిసి పనిచేయాలని మోడీ సూచించారు. వాతావరణం, పంటలు, నేల పరిస్థితులపై ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం ద్వారా రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకునేలా సాంకేతికతను ఉపయోగించా లని చెప్పారు. అంతరిక్ష వ్యర్థాల నిర్వహణపై పనిచేస్తున్న సంస్థలు పర్యావరణ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రధాని సూచించారు. అంతరిక్ష రంగంలోని ఆవిష్కరణలను ఇతర సామాజిక అభివృద్ధి రంగాలతో అనుసంధానిస్తే మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

# దేశంలో భారీగా పెరిగిన చక్కెర ధరలు

### ఇథనాల్ ఉత్పత్తితో ధరలకు సంబంధం లేదన్న కేంద్రం

### ప్రి డయాబిటిస్ కారణం ధల ప్రభావం ఉండదన్న బీహార్ మంత్రి

**న్యూఢిల్లీ,ఆగస్ట్21 :** దేశంలో ఇటీవల చక్కెర ధరలు పెరగడంపై కేంద్రం స్పందించింది. ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడం వల్లే వీటి ధరలు పెరిగాయనడం సరికాదని పేర్కొంది. స్థానికంగా దిగుబడి తగ్గడం, పండగల వేళ డిమాండ్ పెరగడమే ధరల పెరుగుదలకు కారణాలని స్పష్టం చేసింది. ధరల నియంత్రణకు చర్యలు చేపట్టామని.. నిల్వలపై పరిమితులు విధించడంతోపాటు దిగుమతులపైనా సుంకాలు తగ్గించామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశంలో జులై 20న కిలో చక్కెర ధర రూ.48.18గా ఉండగా.. ఆగస్టు 20నాటికి అది రూ.55.70కు పెరిగింది. దీంతో ఇథనాల్ తయారీకి కోసం చక్కెర మళ్లించడం వల్లే ఈ ధరలు పెరిగాయని విపక్షాలు విమర్శలు గుప్పించాయి. పెట్రోల్లో కలిపే ఇథనాల్ తయారీ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో 12శాతం ఉండగా.. 2025-26లో 9శాతానికి తగ్గిందని కేంద్రం తెలిపింది. అంచనాల కంటే తక్కువ దిగుబడి రావడం, పండగల వేళ డిమాండ్, పంట నష్టం, అంతర్జాతీయ సరఫరాల్లో అంతరాయం, ఊహాగానాలతో కొంతమంది నిల్వలు పెంచడం, తదితర కారణాల వల్ల ధరలు పెరిగాయని స్పష్టం చేసింది. దేశంలో దాదాపు మూడోవంతు ఇథనాల్.. మొక్కజొన్న వంటి ధాన్యాల నుంచే ఉత్పత్తి అవుతోందని తెలిపింది. దేశవ్యాప్తంగా గత వారం రోజులుగా చక్కెర ధరలు పెరుగుతున్న క్రమంలో.. ఈ పరిణామంపై బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రావణ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈరోజుల్లో ప్రతీ ఒక్కరికీ డయాబెటిస్ ఉందని.. అందువల్ల పంచదార ధర పెరిగినా పెద్ద ప్రభావం ఏం ఉండకపోవచ్చని ఈ బీహార్ మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రీ-డయాబెటిక్, డయాబెటిక్ కేసులు పెరుగుతున్న కారణంగా ప్రజలు ఎలాగూ చక్కెర వినియోగం విషయంలో జాగ్రత్త పడుతున్నారని.. ఈ క్రమంలో చక్కెర ధర పెరిగినా దేశ ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చనేది ఈ మంత్రి వ్యాఖ్యల సారాంశం. మధుమేహ రోగుల కేసులు పెరుగుతున్నందున, ప్రజలు స్వీట్లు తినడం లేదని, స్వీట్లు తక్కువగా తింటున్నారని మంత్రి చెప్పారు. విలేకరుల ముందు ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదెక్కడి లాజిక్ అని.. మంత్రి ప్రకటనపై ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షమైన ఆర్జేడీ మాత్రం కుమార్పై తీవ్రమైన వ్యంగ్యంతో విరుచుకుపడింది. కప్పు టీతో తమ దినచర్యను ప్రారంభించే లేదా బ్రెడ్ లేదా బిస్కెట్ను టీలో ముంచుకుని తాగే సామాన్య ప్రజలు, పెరుగుతున్న చక్కెర ధరల వల్ల తీవ్ర ప్రభావానికి గురయ్యారని ఆర్జేడీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ తెలిపారు. శ్రావణ్ కుమార్ ఒక మంత్రి అయినందు వల్ల.. ఆయన పెరుగుతున్న చక్కెర ధరను భరించగలరని.. అందుకే చక్కెర ధరలపై సామాన్య ప్రజల ఆందోళనలు ఆయనకు హాస్యాస్పదంగానే అనిపించవచ్చని అహ్మద్ అన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి : మంత్రి సీతక్క వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్21 :** ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించి ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాల్సి ఉందని సూచించారు.

# తానెక్కడా కాంగ్రెస్ నేతలను విమర్శించలేదు

### మరోమారు రాజగోపాల్ రెడ్డి వివరణ

**యాదాద్రిభువనగిరి,ఆగస్ట్21 :** కాంగ్రెస్లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తానుచేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# రాచయదుర్గం భూముల వేలానికి తొలగిన అడ్డంకి

### కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకణ

### హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్కు సూచన

**న్యూఢిలీ,ఆగస్ట్21 :** రాయదుర్గం పాన్మక్తా భూముల వేలం పక్రియలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. వేలం పక్రియను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏదైనా అభ్యంతరం ఉంటే హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్మాల్య బాగ్చీ, జస్టిస్ మోహన్ ఉన్నారు. దీంతో రాయదుర్గం పాన్మక్తా భూముల వేలం కొనసాగించేందుకు టీజీఐఐసీకి న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్టయ్యాయి. రాయదుర్గం పాన్మక్తా ప్రాంతంలోని రెండు సర్వే నంబర్లలో సుమారు 11 ఎకరాల భూముల విక్రయానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో ఎకరాకు రూ.175 కోట్లను కనీస ధరగా నిర్ణయించింది. ఈ వేలాన్ని సవాలు చేస్తూ ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, రక్షించాల్సిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. అయితే పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. కంచ గచ్చిబౌలి భూములకు, ప్రస్తుతం వేలం వేయనున్న భూములకు ఎలాంటి సంబంధం లేదని, అవి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. టీజీఐఐసీ నోటిఫికేషన్లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. అంతే కాదు తదుపరి పిటీషన్పై విచారణకు నిరాకరించింది.

# గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### అధికారులకు సంజయ్ జాజు ఆదేశం

**హైదరాబాద్,ఆగస్ట్ 21 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్లో హైదరాబాద్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర?సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ÷లంగాణలోని వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్పో (ఇలూనీబ)లను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు.అలాగే, తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ శశాంక, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# టీమిండియా-ఆఫ్ఘనిస్థాన్ టీ20 సిరీస్ తేదీలు మారే అవకాశం!



**భారత్, ఆఫ్ఘనిస్థాన్ టీ20 సిరీస్ తేదీల్లో మార్పుల యత్నం**

**గణేశ్ చతుర్థిని దృష్టిలో ఉంచుకుని ఏసీబీ ప్రతిపాదన**

**వ్యూయర్‌షిప్, హాజరు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక**

**తుది నిర్ణయం ఆఫ్ఘన్ బోర్డుదేనన్న బీసీసీఐ**

భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ తేదీలను మార్చే విషయమై ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో చర్చలు జరుపుతోంది. గణేశ్ చతుర్థి పండుగను దృష్టిలో ఉంచుకుని, ప్రేక్షకుల హాజరుతో పాటు టెలివిజన్ వీక్షకుల సంఖ్యను పెంచుకునే వ్యూహంతో ఏసీబీ ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ సిరీస్‌ను సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఏసీబీ ఇప్పుడు ఈ తేదీలను సెప్టెంబర్ 11, 13, 14గా మార్చాలని కోరుతోంది. ఈ సిరీస్‌కు ఆఫ్ఘనిస్థాన్ ఆతిథ్యం ఇస్తుండగా, వారికి సొంతగడ్డపై అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేందుకు మైదానాలు లేకపోవడంతో భారత్‌నే వేదికగా ఎంచుకుంది. "ఈ విషయంపై ఏసీబీ, బీసీసీఐతో చర్చిస్తోంది. సోమవారం నాటికి అధికారికంగా ఆమోదం లభించవచ్చు. సెప్టెంబర్ 14న ఒక మ్యాచ్ జరిగే అవకాశం ఎక్కువగా ఉంది" అని సిరీస్ ప్రసార హక్కులు పొందిన ఐటీడబ్ల్యూ యూనివర్స్ సహ-వ్యవస్థాపకుడు భైరవ్ శాంత్ శుక్రవారం మీడియాకు తెలిపారు. మరోవైపు, ఈ మార్పుల గురించి తమకు ముందుగా ఎలాంటి సమాచారం లేదని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అధికారి ఒకరు తెలిపారు. అయితే, షెడ్యూల్ మార్పుపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ఏసీబీదేనని బీసీసీఐ స్పష్టం చేసింది. "ఇది ఆఫ్ఘనిస్తాన్ నిర్ణయం, మాది కాదు. వారు తమ దేశంలో మైదానాలు లేనందున ఇక్కడ సిరీస్ నిర్వహిస్తున్నారు. కాబట్టి తుది నిర్ణయం ఏసీబీ నుంచే వస్తుంది," అని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు. ఈ టీ20 సిరీస్‌తో ఇరు జట్ల మధ్య మల్టీ-ఫార్మాట్ సిరీస్ పూర్తికానుంది. గత జూన్‌లో జరిగిన వన్-ఆఫ్ టెస్ట్, మూడు వన్డేల సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. రాబోయే టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుండగా, ఫ్యాన్‌కోడ్ స్ట్రీమింగ్ హక్కులను కలిగి ఉంది.

## తొలి టెస్టు విజయం తర్వాత.. టీమిండియాకు ప్రత్యేక విందు



శ్రీలంక పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు కొలంబోలో ఘనమైన ఆతిథ్యం లభించింది. పర్యటనలో భాగంగా శ్రీలంకతో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో రెండో మ్యాచ్‌కు ముందు, శ్రీలంకలోని భారత హైకమిషనర్ సంతోష్ ఝా ఇరు దేశాల జట్లకు విందు ఏర్పాటు చేశారు. కొలంబోలోని ఇండియా హౌస్‌లో నిన్న రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. రెండో టెస్టుకు సన్నద్ధమవుతున్న భారత, శ్రీలంక ఆటగాళ్లు ఈ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గురించి బీసీసీఐ తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. "కొలంబోలో ఇదొక చిరస్మరణీయ సాయంత్రం! రెండో టెస్టుకు ముందు శ్రీలంకలో భారత హైకమిషనర్ సంతోష్ ఝా, టీమిండియాకు ఇండియా హౌస్‌లో ఆతిథ్యం ఇచ్చారు" అని పేర్కొంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను కూడా పంచుకుంది. భారత హైకమిషనర్ సంతోష్ ఝా కూడా ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. "టీమిండియాకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శ్రీలంకలో పర్యటిస్తున్న టీమిండియా, శ్రీలంక జట్లకు ఆతిథ్యం ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఇరు దేశాలను కలిపి ఉంచే క్రికెట్, భారత్-శ్రీలంక మధ్య ఉన్న చిరకాల బంధాన్ని మరింత బలోపేతం చేస్తూనే ఉంది" అని ఆయన తన 'ఎక్స్' పోస్టులో తెలిపారు.

### సిరీస్‌లో భారత్ ఆధిక్యం

ప్రస్తుతం రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో శ్రీలంకపై 165 పరుగుల భారీ తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఇక, ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ ఈ నెల 23 నుంచి 27 వరకు కొలంబోలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని శ్రీలంక పట్టుదలతో ఉండగా, విజయాన్ని కొనసాగించి సిరీస్ కైవసం చేసుకోవాలని, తద్వారా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని భారత్ చూస్తోంది.

## టెస్టుల్లో మరో అరుదైన ఘనత.. సచిన్ సరసన జో రూట్



ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ జో రూట్ అరుదైన ఘనత సాధించాడు. టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సార్లు 50కి పైగా పరుగులు చేసిన భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును సమం చేశాడు. పాకిస్థాన్‌తో హెడింగ్లీలో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు ఆటలో రూట్ ఈ మైలురాయిని అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 112 బంతుల్లో 10 ఫోర్లతో 66 పరుగులు చేసిన రూట్, తన టెస్ట్ కెరీర్‌లో 68వ అర్ధ శతకాన్ని నమోదు చేశాడు. దీంతో టెస్టుల్లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్‌తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాడు. వీరి తర్వాత వెస్టిండీస్ ఆటగాడు శివనారాయణ్ చందర్‌పాల్ (66), ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్, భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ (63) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక, కెప్టెన్‌గానూ రూట్ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. సారథిగా అత్యధిక 50ం స్కోర్లు చేసిన వారి జాబితాలో రూట్ (42) ఐదో స్థానానికి చేరుకున్నాడు. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ (61) అగ్రస్థానంలో ఉండగా, రికీ పాంటింగ్ (54), అలన్ బోర్డర్ (51), పాకిస్థాన్ మాజీ కెప్టెన్ మిస్బా-ఉల్-హక్ (43) అతని కంటే ముందున్నారు. ఈ తాజా మైలురాయితో టెస్ట్ ఫార్మాట్‌లో అత్యుత్తమ బ్యాట్స్‌మెన్‌లలో ఒకడిగా రూట్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు.



## భారత్‌తో రెండో టెస్టుకు శ్రీలంక జట్టులో భారీ మార్పులు..

### ఐదుగురిపై వేటు!

భారత్‌తో జరిగిన తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన శ్రీలంక, రెండో టెస్టు కోసం తమ జట్టులో భారీ మార్పులు చేసింది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టుతో ఆదివారం కొలంబోలో ప్రారంభంకానున్న చివరి టెస్టు కోసం 14 మంది సభ్యులతో కూడిన జట్టును శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) ప్రకటించింది. ఈ జట్టు నుంచి ఐదుగురు ఆటగాళ్లను తప్పించి, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న ఇద్దరు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ఆల్ రౌండర్ సహన్ అరాచ్చిగే, బ్యాటర్ కమిల్ మిషారాలు తొలిసారిగా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నారు. గాలేలో జరిగిన తొలి టెస్టులో గాయపడిన సీనియర్ ఆటగాడు దినేశ్ చండిమాల్ రెండో టెస్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అరంగేట్రం చేసిన పసిందు సూరియబండార, తాను ఆడిన ఏకైక ఇన్నింగ్స్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరగడంతో అతనిపైనా సెలక్టర్లు వేటు వేశారు. వీరితో పాటు ఓపెనర్ నిషాన్ మదుష్క, బౌలింగ్ ఆల్ రౌండర్ రమేశ్ మెండిస్, ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మదుష్కలను కూడా జట్టు నుంచి తప్పించారు. ఇటీవల భారత్-ఏ జట్టుతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో శ్రీలంక-ఏ జట్టుకు నాయకత్వం వహించి అద్భుత ప్రదర్శన చేసిన సహన్ అరాచ్చిగేకు సెలక్టర్ల నుంచి పిలుపు అందింది. ఆ సిరీస్‌లో అతను రెండో మ్యాచ్‌లో 127 పరుగులు, తొలి మ్యాచ్‌లో 72 పరుగులు సాధించాడు. మొత్తం రెండు మ్యాచ్‌లలో 209 పరుగులతో తన జట్టు తరపున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరోవైపు, బ్యాటర్ కమిల్ మిషారా కూడా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల ముగిసిన లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) 2026 సీజన్‌లో 9 ఇన్నింగ్స్‌లలో 411 పరుగులు చేసి సత్తా చాటాడు. ఇందులో గాలే గ్యాలంట్స్‌పై సాధించిన సెంచరీ కూడా ఉంది. అంతేగాక మేజర్ క్లబ్స్ టీ20 టోర్నీలో గురువారం కేవలం 72 బంతుల్లో 145 పరుగులు బాది తన విధ్వంసకర ఫామ్‌ను చాటుకున్నాడు. భారత్, శ్రీలంక మధ్య జరిగిన తొలి టెస్టులో టీమిండియా 165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో భారత బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (167) సెంచరీతో కదం తొక్కగా, ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 10 వికెట్లు పడగొట్టి లంక పతనాన్ని శాసించాడు. ఈ నేపథ్యంలో సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో శ్రీలంక పటిష్ఠమైన జట్టుతో బరిలోకి దిగుతోంది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ఆగస్టు 23న ప్రారంభం కానుంది.

### రెండో టెస్టుకు 14 మంది సభ్యులతో శ్రీలంక జట్టు ఇదే..

లహిరు ఉడార, కమిల్ మిషారా, పసిందు సూరియబండార, కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), ధనంజయ డి సిల్వా (కెప్టెన్), సహన్ అరాచ్చిగే, సోనాల్ దినుష, నిరోషన్ డిక్వెల్లా, కేశార నువంత, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, లహిరు కుమార, అశిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో.




## వరల్డ్ ఛాంపియన్ షిప్ లో పుల్లెల గాయత్రి గోపీచంద్ దూకుడు... పతకం ఖాయం

భారత బ్యాడ్మింటన్ రంగంలో ఒకటిన్నర దశాబ్ద కాలంగా సాగుతున్న నిరీక్షణకు తెరపడింది. యువ క్రీడాకారిణులు గాయత్రి గోపీచంద్ - ట్రీసా జాలీ ద్వయం ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖాయం చేసుకుంది. మహిళల డబుల్స్ విభాగంలో సెమీ ఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా వీరు ఈ చారిత్రక ఘనతను సొంతం చేసుకున్నారు. ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్ ఫైనల్ పోరులో గాయత్రి - ట్రీసా జోడీ, చైనాకు చెందిన జియా యిఫాన్ - జాంగ్ షుక్సియాన్ జంటపై అద్భుత విజయం సాధించింది. తొలి గేమ్‌ను 16-21 తేడాతో కోల్పోయినప్పటికీ, భారత ద్వయం అసాధారణ రీతిలో పుంజుకుంది. ఆ తర్వాత రెండు గేమ్‌లను 21-15, 21-13 స్కోరుతో వరుసగా కైవసం చేసుకుని మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో సెమీస్‌లో అడుగుపెట్టిన భారత జోడీ, కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారిణులు పతకం సాధించడం గత 15 ఏళ్లలో ఇదే తొలిసారి. చివరగా 2011లో గుత్తా జ్వాల - అశ్విని పొన్నప్ప జోడీ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డుకు ఎంపికైన గాయత్రి, ట్రీసాతో కలిసి బరిలోకి దిగి అంచనాలకు తగ్గట్టుగా రాణించింది. ఒకవేళ సెమీ ఫైనల్‌లోనూ విజయం సాధిస్తే, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళల డబుల్స్ జోడీగా వీరు సరికొత్త చరిత్ర సృష్టిస్తారు.

# నటి షావుకారు జానకి మృతి

## వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత,, షావుకారు సినిమాతో పేరు స్థిరం



తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.



# ఇరుముడి ఎమోషనల్ డ్రామా



రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

## 'స్పిరిట్'లో దీపిక 10 శాతం లాభం అడిగారా? సందీప్ వంగా సోదరుడి సంచలన ఆరోపణలు



ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న స్పిరిట్ సినిమా నుంచి దీపికా పదుకొణె తప్పుకోవడం ఇప్పటికే పెద్ద చర్చకు దారితీసింది. తాజాగా ఈ వివాదంపై సందీప్ రెడ్డి వంగా సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. దీపిక రెమ్యునరేషన్, పని గంటలతో పాటు సినిమా లాభాల్లో వాటా కూడా అడిగారని ఆయన ఆరోపించారు. ప్రణయ్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దీపికా పదుకొణె సినిమా లాభాల్లో 10 శాతం వాటా కోరారని చెప్పారు. ఆమె ఏదైనా డిమాండ్ చేయవచ్చని, అయితే సినిమా బడ్జెట్‌కు ఆ డిమాండ్ సరిపోవాలని అన్నారు. ఆర్థికంగా లెక్కలు సరిపోకపోవడంతో ఇతర ఆప్షన్ల కోసం వెతికామని తెలిపారు. దీపికతో సందీప్ సుమారు 18 నెలల పాటు మాట్లాడారని ప్రణయ్ తెలిపారు. సినిమా కథ, పాత్రకు సంబంధించిన వివరాలను ఆమెతో చర్చించామని చెప్పారు. అయితే తమ మధ్య అంతర్గతంగా జరిగిన చర్చలు బయటకు వెళ్లడంతో తాము అసంతృప్తికి గురయ్యామని ప్రణయ్ ఆరోపించారు. దీపికను మార్చడానికి ప్రధాన కారణాల్లో రెమ్యునరేషన్, పని వేళలు ఉన్నాయని ప్రణయ్ చెప్పారు. ఇది కేవలం అదనంగా రూ.5-6 కోట్లు అడిగిన వ్యవహారం కాదని స్పష్టం చేశారు. ఈ వివాదం సమయంలో సందీప్ రెడ్డి వంగా కూడా 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేశారు. పేరు చెప్పకుండా ఓ నటిని ఉద్దేశిస్తూ.. కథను నమ్మకంతో చెప్పిన తర్వాత ఆ వివరాలు బయటకు చెప్పడం సరికాదని అన్నా రు. తన కథను బయటకు చెప్పడం, యువ నటిని కించపరచడం వంటి చర్యలను ఆయన ప్రశ్నించారు. "ఇదేనా మీ ఫెమినిజం?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్పిరిట్ నుంచి తప్పుకోవడానికి ముందు దీపిక 8 గంటలు మాత్రమే పనిచేస్తానని కోరినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై గతంలో ఆమె స్పందిస్తూ.. తాను అడిగింది అన్యాయమైన డిమాండ్ కాదని చెప్పారు. మహిళా నటిగా మాత్రమే కాకుండా, చాలా మంది పురుష నటులు కూడా ఏళ్లుగా 8 గంటల షిఫ్ట్‌లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. దీపిక స్థానంలో త్రిప్తి డిమ్రీని హీరోయిన్‌గా తీసుకున్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరో గా తెరకెక్కుతున్న స్పిరిట్ 2027 మార్చిలో విడుదల కానుంది.

## చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్.. ప్రేమలు భామ దారెటు?

మమిత బైజు పేరు ఈమధ్య సోషల్ మీడియాలో ఏ రేంజ్‌లో తిరుగుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 'ప్రేమలు'తో ఒక్కసారిగా తెలుగు, తమిళ ప్రేక్షకులకు దగ్గరైన ఈ అమ్మాయి.. ఆ తర్వాత వరుసగా మంచి సినిమాలు పట్టేస్తోంది. ఇప్పుడు 'విశ్వనాథ్ అండ్ సన్స్' తర్వాత వచ్చిన రెస్పాన్స్ చూస్తుంటే మమిత నెక్ట్ ఎవరితో చేస్తుందన్నదే ఎక్కువ ఇంట్రెస్ట్‌గా మారింది. 'ప్రేమలు'లో రీను పాత్ర మమితకు బాగా కలిసి వచ్చింది. నేచురల్ లుక్, సింపుల్ క్యారెక్టర్ కావడంతో ఆ సినిమా తర్వాత ఆమెకు మంచి ఫాలోయింగ్ వచ్చింది. తర్వాత ప్రదీప్ రంగనాథన్‌తో 'డ్యూడ్', విజయ్ 'జన నాయకన్', ధనుష్ 'కారా' లాంటి సినిమాలతో తమిళంలో కూడా వరుసగా పెద్ద ప్రాజెక్టుల్లో కనిపించింది. ఇప్పుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' చేయడం వల్ల స్టార్ హీరో పక్కన కూడా మమిత ఎలా కనిపిస్తుందో ఒక క్లారిటీ వచ్చేసింది. ఇక్కడే ఆమె కెరీర్‌కు నెక్ట్ స్టెప్ కనిపిస్తోంది. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాలు చేస్తున్న ప్రభాస్, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి హీరోల దగ్గర హీరోయిన్ కాంబినేషన్స్ కూడా పెద్ద చర్చే అవుతున్నాయి. రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, త్రిప్తి డిమ్రి లాంటి పేర్లు వరుసగా పెద్ద సినిమాల్లో కనిపిస్తున్నాయి. అదే లిస్టులో మమిత పేరు కూడా చేరే టైమ్ వచ్చిందా అనిపిస్తోంది. కాకపోతే మమిత ఇప్పటివరకు చేసిన పాత్రలు ఎక్కువగా నేచురల్, యూత్‌ఫుల్‌గా ఉండేవే. పెద్ద యాక్షన్ సినిమా, భారీ సెటప్, స్టార్ హీరోతో గ్లామర్ ఎక్కువగా ఉండే పాత్రలో మాత్రం ఇంకా పరీక్ష కాలేదు. అందుకే ఒక్కసారిగా అలాంటి సినిమా వస్తే ప్రేక్షకులు ఎలా తీసుకుంటారన్నది కూడా చూడాలి. అదే సమయంలో ఇప్పుడున్న ఫ్రెష్ ఫేస్ ఇమేజ్ ఆమెకు పెద్ద ప్లస్ కావచ్చు. మరో విషయం ఏంటంటే మమితను ఇప్పుడు ఒక్క మలయాళ హీరోయిన్‌గా చూడడం కూడా కష్టం. 'ప్రేమలు'తో తెలుగులో పరిచయం ఉంది.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342